సాక్షి
బాపట్ల
శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



తరలిన ప్రభలు


చిలకలూరిపేట: పురుషోత్తమపట్నం నుంచి 10 ప్రభలు కోటప్పకొండకు తరలాయి. ఇందులో ఆరు విద్యుత్ ప్రభలు. పూజల్లో మంత్రి రజిని పాల్గొన్నారు. ఎడ్లబండిని తోలి సందడి చేశారు.



పోలీసులకు సహకరించాలి

నరసరావుపేట రూరల్: తిరునాళ్లకు వచ్చే భక్తులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ రవి శంకర్‌రెడ్డి కోరారు. కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్‌లో పోలీసులకు విధులపై దిశానిర్దేశం చేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

మహాశివరాత్రికి ప్రత్యేక వైద్య బృందాలు

గుంటూరుమెడికల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. తాళ్లాయపాలెం, చేబ్రోలు, వడ్ల మూడి క్వారీ, సంగంజాగర్లమూడి, మేడికొం డూరు కైలాసగిరి వద్ద వైద్యులు, వైద్య సిబ్బం దితో ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటు చేశా మన్నారు. 18వ తేదీ ఉదయం 6 గంటల నుం చి 19వ తేదీ మధ్యాహ్నం వరకు ప్రత్యేక వైద్య బృందాలు ఆయా శివాలయాల వద్ద అందుబా టులో ఉండి వైద్య సేవలు అందిస్తారని వెల్ల డించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట రూరల్: తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుం డా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొండకు వచ్చే అన్ని రహదారులను సిద్ధం చేసి నట్టు తెలిపారు. యల్లమంద బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో ప్రభలు, వాహ నాల రాకపోకలు యథావిధిగా సాగించవచ్చ న్నారు. ట్రాఫిక్ నియంత్రణకు వన్‌వేను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రోటోకాల్ వాహనాలు మినహా ప్రైవేటు వాహనాలకు కొండపైకి అనుమతిలేదని స్పష్టం చేశారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అరటి పండ్లు, బిస్కెట్లు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు



నగరంపాలెం: ఉమ్మడి జిల్లాలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాధ వరెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు నగరంలోని రింగ్‌రోడ్డులో భీమినేని ఎంటర్‌ప్రైజెస్, డొంక రోడ్డులోని శ్రీలక్ష్మీచెన్నకేశవ వాటర్ ప్లాంట్, బాపట్లలోని ఆర్కే వాటర్ ప్లాంట్, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని అమృత మినరల్ వాటర్ ప్లాంట్‌లలో తనిఖీలు కొనసాగాయి. ప్యాకింగ్ లైసెన్సు, ఫుడ్ లైసెన్సు, జీఎస్టీ రిజిస్ట్రే షన్, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలు పరిశీలించారు. నీటి నమూనాలు సేకరించారు. తనిఖీల్లో సీఐ ఎ.శ్రీహరిరావు, లక్ష్మారెడ్డి, ఎస్సై రామచంద్రులు, ఏఈఓ కె.మల్లికార్జునరెడ్డి, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాత్రి 10 గంటల నుంచి మిర్చి దిగుమతులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో సోమవారం నుంచి రాత్రి 10 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే మిర్చి బస్తాల దిగుమతులు ఉంటాయని మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెం కటేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యార్డుకు సగటున రోజుకు సుమారు 1.25 లక్షల బస్తాలు వస్తున్నాయని పేర్కొన్నారు. యార్డులో ట్రాఫిక్‌కు అం తరాయం ఏర్పడకుండా పటిష్ట చర్యలు చేపడు తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే మిర్చి బస్తాలను లోనికి అనుమతిం చడం జరుగుతోందని, మార్కెట్ కమిటీకి రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షలపై కాల్ సెంటర్ ఏర్పాటు

గుంటూరుఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సమస్యలను అధికా రుల దృష్టికి తీసుకువచ్చేందుకు గుంటూ రులోని ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాల యంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్ ఐవో జి. సునీత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టికెట్లకు సంబంధించిన సమస్యలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సమస్యలను నేరుగా 0863-2228528 నంబర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరీక్ష లకు సంబంధించిన సమాచార సేకరణ, ఫిర్యాదుల నమోదుకు ఇదే నంబర్‌ను వినియో గించుకోవాలని తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్ర వారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6300, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

శివ పూజకు వేళాయె

నేడు మహాశివరాత్రి వేడుకలు

- ఓంకారంతో మారుమోగనున్న శైవక్షేత్రాలు
- గోవాడలో వైభవంగా శివరాత్రి
- అరవపల్లె, మోర్తోటలో సంబరాలు
- చినగంజాం బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో ఘనంగా జరగనున్న వేడుకలు
- భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



గోవాడలో ఉత్సవాలకు ముస్తాబైన బాలకోటేశ్వరస్వామి దేవస్థాన ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: శివరాత్రి పర్వదినం సంద ర్భంగా జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శైవక్షే త్రాలు శివనామ స్మరణతో మారుమోగుతు న్నాయి. ప్రధాన శైవ క్షేత్రాలైన గోవాడ బాలకోటే శ్వరస్వామి దేవస్థానం, అరవపల్లె బాలకోటేశ్వరా లయం, ముర్తోట ముక్తేశ్వరాలయం, అద్దంకి మల్లేశ్వరాలయం, చినగంజాం బాలకోటేశ్వరాల యం, రామకోటేశ్వరస్వామి దేవస్థానం, బాపట్ల సోమేశ్వర ఆలయం, రామలింగేశ్వర ఆలయం, అప్పికట్ల శివాలయంతో పాటు అన్ని శైవ క్షేత్రాలు శివరాత్రి శోభను సంతరించుకున్నాయి. ఆయా ఆలయ కమిటీలు, రెవెన్యూ, పోలీసు యంత్రాం గం వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో దేవాలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశాయి. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, చలువ పందిళ్లు, ప్రత్యేక ఆకర్షణగా ముఖద్వారాలు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. లక్షలాది మంది తరలిరానుండటంతో ప్రధాన ఆలయాల వద్ద లడ్డూ, ఇతర ప్రసాదాలు సిద్ధం చేశారు. భక్తుల రాకపోకల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడు పుతోంది.

గోవాడలో వైభవంగా..

వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలం లోని గోవాడ ఆలయంలో శుక్రవారం నుంచి మంగ ళవారం వరకు ఐదు రోజులు శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. స్థానికులతో పాటు చుట్టుప క్కల జిల్లాల నుంచి సుమారు రెండు లక్షల మంది కిపైగా భక్తులు తరలిరానున్నారు. ప్రభలు పెద్దఎ త్తున ఏర్పాటు కానున్నాయి. ఆర్డీవో పార్థసారథి, డీఎస్పీ మురళీకృష్ణ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. మం త్రి మేరుగ నాగార్జున శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బం దులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. రేపల్లె నియోజకవర్గంలోని అరవపల్లె బాల కోటేశ్వరస్వామి ఆలయంలోనూ శివరాత్రి ఉత్స వాలు ఘనంగా జరగనున్నాయి. 50 వేల మందికి పైగా భక్తులు హాజరు కానున్నారు. మూర్తోట ముక్తే శ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. అద్దంకి మల్లేశ్వరస్వామి ఆలయం లో ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు. చినగంజాం మండలంలోని కొత్త పాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరగనున్నాయి. సోపిరాల బాలకోటేశ్వరస్వామి ఆలయంలోనూ శివరాత్రి ఘనంగా జరగనుంది. బాపట్ల పరిధిలోని అప్పికట్ల శివాలయం, సోమేశ్వరాలయం, రామలిం గేశ్వర దేవస్థానంలో ఉత్సవాలు వైభవంగా జరుగు తాయి.

దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా దేవా లయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆధ్వర్యం లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గోవాడ(వేమూరు): మహాశివరాత్రి సందర్భంగా బాలకోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర సాం ఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. గోవాడ గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలు పనులను ఆయన పరిశీలించారు. పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయం తో పనిచేసి మహా శివరాత్రి ఉత్సవాలను విజయ వంతం చేయాలని కోరారు. భక్తులకు తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. శివరాత్రికి వేలాది మంది వచ్చి దేవదేవుని దర్శనం చేసుకుం టారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుం డా అధికారులు తగుచర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎండో మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, రేపల్లె ఆర్డీవో పార్థసారథి, దేవస్థానం బోర్డు చైర్మన్ చౌదరి, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, మార్కెట్ యార్డు చైర్మన ఏడుకొండలు, రేపల్లె డీఎస్పీ ముర ళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరా సక్రమంగా జరగాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్ర వారం రాత్రి కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాగునీరు అందించే కాలువలను శుభ్రం చేయించడం, గుర్రపు డెక్కా తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని చెప్పారు. గుంటూరు చానల్, అప్పాపురం చానల్‌లో గుర్రపు డెక్కా అధి కంగా పెరిగిందన్నారు. తొలగించిన కొన్ని రోజు ల్లోనే తిరిగి పెరుగుతోందని, రైతులు ఇబ్బందు లకు గురవుతున్నారని తెలిపారు. కాలువల్లో నీరు లేని సమయంలో శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంట కాలువలు, డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలన్నారు. మొక్కజొన్న, జొన్న, శనగ పంటలు చేతికొచ్చే సమయానికి సేకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్వింటా శనగలు మార్కె ట్‌లో రూ.4,200 నుంచి రూ.4,300 ధర పలుకు తున్నాయని, శనగలకు ప్రభుత్వం రూ.5,300 మద్దతు ధర ఇస్తోందన్నారు. 2,500 టన్నుల శనగ లను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలిపారు. క్వింటా మినుములు రూ.6,600, పెసలు రూ.7,700, మొక్కజొన్న రూ.1,960కు ప్రభుత్వ మద్దతు ధర ఇస్తోందని వివరించారు. రైతులు తమ ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంట సేకరణ కేంద్రాల్లో అమ్ముకునే విధం గా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 176 ఆర్‌బీకేల్లో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను గ్రౌండ్ చేశామన్నారు. వీటిలో టార్పాలిన్ పట్టాలు, ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, నాగళ్లు అందుబా టులో ఉంటాయని తెలిపారు. అవసరమైన వాటిని రైతులు పొందవచ్చన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా వ్యవ సాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరా మకృష్ణ మాట్లాడుతూ రైతులకు మంచి చేయా లన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని పేర్కొ న్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బం దులు తలెత్తకుండా గుంటూరు చానల్, అప్పా పురం చానల్ ద్వారా చెరువులను నింపేందుకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెం కటేశ్వర్లు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డీఎం కృ ష్ణారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటే శ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వరులకు మంగళగిరి చేనేత వస్త్రాలు



ఆప్కో చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): మహా శివరా త్రిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు శివభక్త మార్కండేయ వంశీకులు శుక్రవారం పట్టువస్త్రా లను సమర్పించారు. మార్కండేయ ట్రస్ట్ వ్యవ స్థాపకుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాధా దంపతులు, ట్రస్ట్ దామర్ల వెంకట నరసింహం పట్టువస్త్రాలను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయ ప్రాంగ ణంలోని మల్లేశ్వర స్వామి వార్ల బాలాలయంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు జరిపించుకున్న అనంతరం 14 సంప్రదాయ వెదురు బుట్టలలో వస్త్రాలు, విభూది శ్వేత పట్టు వస్త్రాలు, ఫలపుష్పాలు, ఇతర పూజా సామగ్రిని స్వామి వారికి సమర్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా ఆలయ అధికారులు ప్రసాదాలను బహూకరించారు. భక్త మార్కం డేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యే కంగా తయారు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు, చేనేత ప్రముఖులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పరుగులు

- ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- జిల్లాలో ఎంఎస్ఎంఈ కింద 5,967 యూనిట్లు మంజూరు
- జిల్లాకు ఏడు భారీ పరిశ్రమలు
- రూ.3,269 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- జిల్లాలో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- చిన్న యూనిట్లకు పెద్ద ప్రోత్సాహం
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వాల సహకారం
- క్లస్టర్లుగా ఏర్పడితే భారీ రాయితీ



బల్లికురవలోని గ్రానైట్ పరిశ్రమ

బాపట్ల టౌన్: జిల్లా పారిశ్రామికంగా పరుగులు పెడుతోంది. గతంలో గ్రామీణ, వ్యవసాయ ప్రాం తంగా గుర్తింపు పొందిన తీరప్రాంతం పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందనుంది. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్ర మలను ప్రోత్సహించడంలో భాగంగా జిల్లాకు ప్రధాన ఆదాయ వనరులుగా ఆక్వాతో పాటు గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. నూతనంగా ఏర్ప డిన బాపట్ల జిల్లాలో 74 కి.మీ. తీరప్రాంతం విస్తరిం చి ఉంది. తీరప్రాంతం వెంబడి రొయ్యలు, చేపల పెంపకాలు విస్తృతంగా చేస్తుండటంతో ఆక్వాపరం గా రొయ్యల హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 5 ప్రాసెసింగ్ యూనిట్లతో పాటు మరో 18 హేచరీలు ఉన్నాయి. వీటి ద్వారా వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్, చీరాల పరిధిలోని ఓడరేవు హార్బర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.750 కోట్ల వ్యయంతో పనులు చేస్తున్న ఆ ప్రాజెక్టులు పూర్తయితే వాటి అనుబంధంగా మరెన్నో పరిశ్ర మలు ఏర్పడతాయి. జిల్లాలో ఇప్పటికే ఎంఎస్ఎం ఈ కింద 5,967 యూనిట్లు మంజూరు కాగా, వాటికి గానూ రూ.2,108 కోట్లు మంజూరు చేశారు. ఈ పరిశ్రమల ద్వారా జిల్లాలో 36,400 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. వీటితోపాటు జిల్లాలో 7 భారీ పరిశ్రమలు నెలకొల్పనున్నారు. వాటికి సంబంధించి ఫైల్స్ ఫైనల్ దశలో ఉన్నాయి. వాటికి గానూ రూ.1161 కోట్లు మంజూరు చేశారు. ఈ పరిశ్రమల ద్వారా 6,414 మందికి ఉపాధి అవ కాశాలు లభించే అవకాశం ఉంది.

చిన్న యూనిట్లకు పెద్ద ప్రోత్సాహం

కోవిడ్ తర్వాత కుదేలైన పరిశ్రమలకు పూర్వ వైభ వాన్ని తెచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్ర మల ఏర్పాటుకు చేయూతనందించనున్నాయి. ఈ పథకం అమలుకు ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెం ట్ కార్పొరేషన్ స్టేట్ నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ర్యాంప్‌లో భాగంగా క్లస్టరు డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీడీపీ), ఉమ్మడి సదుపాయాల కేంద్రం (కామన్ ఫెసిలిటీ సెంట ర్)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కామన్ ఫెసిలిటీ సెంటర్లకు రెండు కేటగిరీల కింద రాయితీ మంజూరు చేస్తారు. రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఒక కేటగిరీ, రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల మేర మరో కేటగిరీగా పరిగణించి సహాయం చేయనున్నారు.

ఇలా ఏర్పాటు చేస్తే సహకారం

మొదటి కేటగిరీలో ప్రాజెక్ట్‌కు కనీసం 10 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు క్లస్టరుగా ఏర్పాటు చేసుకో వాలి. రెండో కేటగిరీలో 20 సూక్ష్మ, చిన్న తరహా పరి శ్రమలు క్లస్టరుగా ఏర్పాటు కావాలి. మొదటి కేట గిరీ గ్రాంట్‌లో ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, గ్రామీణ ప్రాంతాల వారికి కేంద్ర ప్రభుత్వం 80 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం రాయితీ సమకూరుస్తాయి. రెండో కేటగిరీలో కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం రాయితీ ఇస్తాయి. మొదటి కేటగిరీలో ఇతరులకైతే కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం రాయితీ ఇస్తాయి. రెండో కేట గిరీలో ఇతరులకు కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం చొప్పున రాయితీ అందజేస్తాయి.



చీరాలలోని కంప్యూటరైజ్‌డ్ ఎంబ్రాయిడరీ పరిశ్రమ

నూతనంగా ఏర్పాటు చేయనున్న పెద్ద పరిశ్రమలు

కొరిశపాడు మండలంలోని బొడ్డువారిపాలెం గ్రామంలో రూ.89.22 కోట్లతో స్పైసీస్ ఎక్స్‌ట్రక్షన్ అండ్ పౌడరింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా 80 మంది ఉపాధి అవకాశాలు పొందను న్నారు. అద్దంకి మండలంలోని కుంకుపాడు గ్రామంలో రూ.184 కోట్లతో కొల్లాం స్పిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటిద్వారా 500 మం ది ఉపాధి అవకాశాలు పొందనున్నారు. చెరుకుపల్లి మండలంలోని కుంచాలవారిపాలెం గ్రామంలో రూ.239.14 కోట్లతో ఫ్యాబ్రిక్ డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనిద్వారా 1700 మందికి ఉపాధి కలుగుతుంది. మార్టూరు మండలంలోని జొన్నతాళి గ్రామంలో రూ.126.45 కోట్లతో కాటన్ మిల్లును ఏర్పాటు చేస్తున్నారు. దీనిద్వారా 491 మందికి ఉపాధి కలుగుతుంది. చీరాల పట్టణంలో రూ.148.56 కోట్లతో టుబాకో ప్రాసెసింగ్ కంపెనీ ఏర్పాటు చేశారు. దీనిద్వారా 1650 మందికి, ఇం కొల్లు మండల కేంద్రంలో రూ.172.67 కోట్లతో ఎన్ ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కంపెనీ ఏర్పాటు చేశారు. దీని ద్వారా 743 మందికి, మార్టూరులో రూ.201.4 కోట్లతో అమరావతి టెక్స్‌టైల్స్ ద్వారా 1250 మం ది ఉపాధి అవకాశాలు పొందనున్నారు.

ఎంఎస్ఎంఈలో ఏర్పాటుచేసే కొన్ని పరిశ్రమలు

సెక్టార్ పేరు	యూనిట్లు	రూ. కోట్లలో	ఉపాధి పొందే లబ్ధిదారులు
మినరల్ బేస్‌డ్	1013	1159.25	14,002
సర్వీస్‌బేస్‌డ్	1787	96.95	2897
ట్రాన్స్‌పోర్ట్	498	36.89	3290
అగ్రో అండ్ ఫుడ్	265	439.21	6317
టెక్స్‌టైల్	946	257.56	2226
ఇతర పరిశ్రమలు	837	67.98	3890
ఇంజినీరింగ్‌బేస్‌డ్	28	15.4	597
పేపర్ ప్రింటింగ్	52	18.72	645
రబ్బర్, ప్లాస్టిక్	44	36.98	367
ఉడ్ బేస్‌డ్	18	12.56	265
కెమికల్, ఫార్మా	12	39.76	68

జిల్లాలో 50 వేల మందికి ఉపాధి



జిల్లాలో వివిధ పరిశ్రమల ద్వారా ఇప్పటికే సుమారు 50 వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ కింద రూ.2,108 కోట్లతో 5,967 యూనిట్లు మంజూరయ్యాయి. వాటిద్వారా 36,400 మం దికి, జిల్లాలో రూ.1161 కోట్లతో ఏడు పెద్ద పరి శ్రమలు మంజూరు కాగా, 6,414 మందికి ఉపాధి పొందనున్నారు.

– మదన్‌మోహన్‌శెట్టి, జీఎం, జిల్లా పరిశ్రమల శాఖ

శివరాత్రికి 102 ప్రత్యేక బస్సులు



బాపట్లటౌన్: శివరాత్రి పండుగ సందర్భంగా బాపట్ల జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు 102 ప్రత్యేక బస్సు లను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. ముఖ్యంగా కోటప్పకొండ, శ్రీశై లం, గోవాడ ప్రాంతాలకు బస్సులను నడుపుతున్నా మన్నారు. చీరాల డిపో నుంచి కోటప్పకొండకు 45 బస్సులు, అద్దంకి డిపో నుంచి కోటప్పకొండకు 25, అద్దంకి నుంచి శ్రీశైలం 7, రేపల్లె నుంచి గోవాడ 15, బాపట్ల నుంచి గోవాడ 10 సర్వీసులు నడుపు తున్నామని వివరించారు. డీజిల్ ధర పెరిగినప్పటికీ ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో ఉన్న చార్జీలనే తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సర్వీ సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

1,09,460 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,04,921 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,09,460 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుం చి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 77,785 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటే శ్వరరెడ్డి తెలిపారు.

ఆంగ్ల సాహిత్యం మరింత పెరగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు నాట ఆంగ్ల సాహిత్యం మరింత ఎక్కువగా రావాల్సిన అవసరముం దని ఏపీ మైనార్టీ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి ఇం తియాజ్ అహ్మద్ అన్నారు. రచయిత డాక్టర్ ఆనంద్ మోహన్.ఆర్ రచించిన 'డ్రాప్ ఫాలెన్.. యూ ఆర్ నాట్ ఎలోన్' పుస్తకాన్ని 33వ విజయవాడ పుస్తక మహోత్సవం లోని గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై ఇంతి యాజ్ అహ్మద్ శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజ రైన ఇంతియాజ్ మాట్లాడుతూ ఈ పుస్తకం పాఠకులను చదివించే ఆసక్తిని కలిగిస్తుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ చెన్నారెడ్డి, సిద్ధార్థ కళాశాల అధ్యాపకురాలు బాలాంతరపు ప్రసూన మాట్లాడుతూ పుస్తకంలోని పలు అంశాలను వివరించారు

చైతన్యాన్ని నింపే కత్తి పద్మారావు రచనలు

ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కత్తి పద్మారావు రచనలు సమాజాన్ని ఆలోచింపజేస్తాయని సాహితీవేత్త డాక్టర్ అబ్రహం లింకన్ అన్నారు. కత్తి పద్మారావు సాహిత్య సదస్సులో ఆయన రాసిన 'అంబేడ్కర్ జీవిత చరిత్ర', 'అస్పృశ్యుని యుద్ధగాథ', 'వ్యక్తిత్వ నిర్మాణం' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం విజయవాడ పుస్తక మహోత్స వంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై శుక్ర వారం రాత్రి జరిగింది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్ అహ్మద్

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



హెల్మెట్ వాడకంపై వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్: వాహనచోదకులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. హెల్మెట్ వాడకంపై జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లాలో రోడ్డు ప్రమాధాల వలన గడిచిన రెండు సంవత్సరాల్లో మరణించిన వారిలో 43 శాతం మంది ద్విచక్ర వాహనదారులే ఉన్నారన్నారు. డ్రైవింగ్ సమయంలో మన కుటుంబాలను గుర్తుచేసుకోవాలని తెలిపారు. బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో డ్రైవింగ్ చేయడం వలన రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నివారించవచ్చునని, తప్పనిసరిగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.

20 నుంచి వైద్య బృందం పర్యటన

గుంటూరుమెడికల్: ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్‌ఎస్)కు చెందిన న్యూఢిల్లీ వైద్య బృందం ఈనెల 20 నుంచి జిల్లాలో పర్యటిస్తున్నట్లు స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.రవికుమార్ తెలిపారు. డాక్టర్ రజత్‌కహన్, డాక్టర్ అర్పిత, దీక్షలు జిల్లాలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు పర్యటించి ఆయా ఆసుపత్రుల్లో ఐపీహెచ్‌ఎస్ ప్రమాణాల ప్రకారం వైద్య సేవలు ఉన్నాయా లేవా అనే విషయాలను పరిశీలిస్తారన్నారు. 20వ తేదీ తెనాలి జిల్లా ఆసుపత్రి, 21వ తేదీ పొన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం, 22వ తేదీ పొండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 24వ తేదీ గుంటూరు నగరంలోని బృందావన్‌గార్డెన్స్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తారని వెల్లడించారు. వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రత్యేక వైద్య బృందానికి తగు సమాచారం అందజేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ తెలిపారు.

తిరునాళ్లను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీకి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చినగంజాం: మహాశివరాత్రి తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని శుక్రవారం ఆయన మండలంలోని రామకోటేశ్వరాలయం, బాలకోటేశ్వరాలయాలను సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు దేవాలయాల కమిటీలు వేద మంత్రాలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించడంతో పాటు పట్టు వస్త్రాలు బహూకరించారు. రెండు దేవాలయాల ప్రాంగణంలోని ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, ఇతర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శివరాత్రి తిరునాళ్ల నిర్వాహణకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు అన్నిరకాలు బందోబస్తు చర్యలు తీసుకున్నామన్నారు. రెండు దేవాలయాలకు సంబంధించి తిరునాళ్లను తిలకించేందుకు సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. అందుకు తగినట్లుగా పోలీసు సిబ్బందిని సుమారు 125 మందిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ, ఎస్సై కట్టా అనుక్, దేవాలయాల కమిటీ సభ్యులు టీఎస్సార్ ఆంజనేయులు, పీ రవికుమార్, కే రామసుబ్బారావు, టీ శీతయ్య, ఎన్ రామిరెడ్డి, రాజు వెంకటేశ్వరరెడ్డి, ఎస్వీ రమణారెడ్డి, పేరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ నెట్‌వర్క్‌లో ట్రాక్ మెషిన్ల పాత్ర కీలకం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే ట్రాక్ నెట్‌వర్క్ నిర్వహణలో ట్రాక్ మెషిన్ల కీలకమని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ అమిత్ గోయల్ అన్నారు. స్థానిక నల్లపాడు రైల్వేస్టేషన్‌లోని శాటిలైట్ ట్రాక్ మెషిన్ డిపోను డివిజన్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి డీఆర్‌ఎం రామకృష్ణ అధ్యక్షత వహించారు. గోయల్ మాట్లాడుతూ 2020లో దక్షిణ మధ్య రైల్వేలో 75 ట్రాక్ మెషిన్లు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మొత్తం ఎస్సీఆర్‌లో 150 యంత్రాలు పని చేస్తున్నాయని వెల్లడించారు. గుంటూరు డివిజన్‌లో సొంతంగా 14 ట్రాక్ మెషిన్లు ఉన్నాయని చెప్పారు. నల్లపాడు వద్ద శాటిలైట్ ట్రాక్ మెషిన్ డిపో 10 టన్నుల కెపాసిటి ఉన్న ఈవోటీ క్రేన్‌తో సహా ఒక షెడ్‌తో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ట్రాక్ మెషిన్స్ ఆంజనేయులురెడ్డి, డివిజన్ ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సీనియర్ డీసీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

నూతన వంగడాల వైపు ఆసక్తి చూపాలి



శనగ పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జే.పంగులూరు: ప్రస్తుతం కాలంలో పంటలకు వస్తున్న చీడపీడల దృష్ట్యా, వాటిని తట్టుకుని నిలబడే నూతన వంగడాల వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారని నంద్యాల విత్తన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చందలూరు గ్రామంలో శనగ నూతన వంగడాల సాగు చేస్తున్న రైతుల పొలాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంటల్లో వస్తున్న చీడపీడలను తట్టుకొని ఉండే నూతన శనగ విత్తనాలు కనుగొన్నట్లు తెలిపారు. ఆ విత్తనాలు చందలూరు గ్రామంలో రెండెకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. శనగలో ప్రస్తుతం రబీలో వేసే జేజే విత్తనాలకు బదులు 440 రకం, బోల్ట్‌లకు బదులు 833 రకం ప్రత్యామ్నాయంగా చూపినట్లు తెలిపారు. కొత్త రకం విత్తనాలు వేసిన యర్రంనేని వెంకట్రావులకు పంట బాగా పండినట్లు తెలిపారు. కార్యక్రమంలో కీటక విభాగం పరిశోధకుడు డాక్టర్ మజూసాద్, తెగుళ్ల విభాగం పరిశోధకుడు డాక్టర్ చైతన్య, ప్లాంటేషన్ ఫీడ్ విభాగం పరిశోధకులు డాక్టర్ రమాదేవి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రి పండుగ సందర్భంగా పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా కేశానిపల్లె గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్యకు చెందిన ఎడ్లు 3 వేల అడుగులు బండను లాగి మొదటి బహుమతి రూ.60 వేలను, నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమ గోవర్ధన్‌రెడ్డికి చెందిన ఎడ్లు 2780 అడుగులు లాగి రెండో బహుమతి రూ.50 వేలను, వైఎస్సార్ జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎడ్లు 2704 అడుగుల దూరంలాగి మూడో బహుమతి రూ.40 వేలను, వైఎస్సార్ జిల్లా అనువారిపల్లెకు చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 2612 దూరంలాగి నాల్గవ బహుమతి రూ.30 వేలను, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల వెంకటరాముడు ఎడ్లు 2384 అడుగుల దూరం లాగి 5వ బహుమతి రూ.20 వేలు, పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లు 2009 అడుగుల దూరంలాగి 6వ బహుమతి రూ.10 వేలను దక్కించుకున్నాయి. ఈ ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు.

వ్యవసాయ పారిశ్రామికవేత్తలను తీర్చి దిద్దడమే లక్ష్యం

డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు



శిక్షణకు ఎంపికైన విద్యార్థినులతో డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: ఉత్తమ వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కల్పిస్తోందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హైదరాబాద్‌లోని సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ(ఎన్.ఐ.ఎం.ఎస్.ఎం.ఈ)లో శిక్షణకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం విద్యార్థులను అభినందించారు. డీన్ మాట్లాడుతూ విద్య, విస్తరణ, పరిశోధన, కన్సల్టెన్సీ తదితర అంశాలలో వారికి శిక్షణ ఇస్తారని తెలిపారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక(ఎన్.ఎ.హెచ్.ఈ.పి.)లో భాగంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 20 నుంచి మార్చి 18వ తేదీ వరకు ఉంటుందన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడింది

యడ్లపాడు: డాబా నుంచి కిందపడిన బాలిక మృత్యువుతో తొమ్మిది రోజులు పాటు పోరాడి ఓడిపోయింది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ ఉదయపురి కాలనీలో ఈనెల 8వ తేదీన ఇంటర్ విద్యార్థిని ఇంటిపై నుంచి పడి ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. నాదెండ్ల మండలం గణపవరం సీఆర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ ఏడాది చదువుతున్న కూరాకుల కావ్య(17) ఇంట్లో ఫోన్ మాట్లాడుతుండగా తండ్రి వరప్రసాద్ ఆవేశంగా తోసేయడంతో ఇంటిపై నుంచి కింద పడింది. కుటుంబ సభ్యులు అదేరోజు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న కావ్యకు నాటి నుంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి శోభారాణి ఫిర్యాదుతో ఘటనకు కారణమైన ఆమె భర్త వరప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అయితే తొమ్మిది రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడిన కావ్య శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్ఐ పైడి రాంబాబు తెలిపారు.


అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. గుంటూరులో అభివృద్ధి దినదినాభివృద్ధి చెందుతోందని, ఇదీ గ్రాఫిక్స్ కాదన్న విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలు గుర్తించాలని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో స్థానిక పార్కులు, రోడ్లు, బిల్డింగ్‌లు పునరుద్ధరణ చేసి చూపిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు దూసుకువెళ్తోందన్నారు. 2021-22లో 11.43 శాతం జీఎస్‌డీపీతో దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా ఏపీ ఉందన్నారు. రాష్ట్రంలో వృద్ధి రేటు చూసి పురోగతి సాధించిందా.. తిరోగమనంలో ఉందో చంద్రబాబుకు తెలియటం లేదా అని ప్రశ్నించారు. జిల్లాలో 70కిపైగానే అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు అయ్యాయని, ఇప్పటికే 32 క్లినిక్‌లు మరింత అభివృద్ధి చెందాయన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 49.91 కిలోమీటర్ల మేర విస్తరించిన పేరేచర్ల- కొండమోడు రహదారి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. 2025 నాటికి ప్రసిద్ధ గుంటూరు సన్నం మిర్చి ఎగుమతులను రూ.4,661 కోట్లకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఎగుమతి కార్యాచరణ ప్రణాళికను పంపిందన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన సందర్భంగా సజ్జన్ జిందాల్ పేర్కొన్న మాటలు అక్షర సత్యాలని నిరూపించేలా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ స్పష్టం చేశారు.

ఫుల్ బ్రైట్ ఫెలోషిప్‌పై అవగాహన సదస్సు



జయభారతిని సన్మానిస్తున్న విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: ఫుల్ బ్రైట్ ఫెలోషిప్ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని న్యూఢిల్లీకి చెందిన ఫుల్ బ్రైట్ కమిషన్ భారతదేశ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఐ.జయభారతి పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాంలో ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పీజీ విద్యార్థులకు, విశ్వవిద్యాలయం బోధనా సిబ్బందికి ఫుల్ బ్రైట్ ఫెలోషిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జయభారతి మాట్లాడుతూ ఫుల్ బ్రైట్ ఫుల్ బ్రైట్ లో ఫుల్ ఫుల్ బ్రైట్ , ఫుల్ బ్రైట్ కలాం వివిధ రకాల ఫెలోషిప్ పథకాలు ఉన్నయని వివరించారు. ఫెలోషిప్ పొందాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థులు, బోధన సిబ్బందికి తగిన సహకారం అందజేస్తామని పేర్కొన్నారు.